అందని ఆశలు

(శ్రీ ఇంద్రకాంతి ఘోష్)

1

వరదరాజు హఠాత్తుగా ఒకసారి రైల్లో నే నెక్కిన కంపార్టుమెంటులో కనబడి అన్నాడు—'భాయీ, సరిగ్గా ఇప్పుడే అనుకున్నాను నువ్విక్కడ కనిపిస్తావేమో అని—నావూహ మొలిచినట్టు—తల యెత్తేసరికి నువ్వు ప్రత్యక్షం! నాకు తెలుసు—నే ననుకున్న దట్లా జరిగి తీరుతుంది, ఉత్సాహాతిరేకంవల్ల ఉత్తమజాతి సిగరెట్ ఒకటి 'ఆఫర్' చేసి—'విశేషాలేమిటోయ్' అనే అసాధారణ ప్రశ్న వేశాడు.

ఆప్యాయంగా అంటించి, అనుక్షణంలోనే ఒక సుగంధిల మేఘమండలాన్ని సృజించి వాటిమధ్య ఆలోచించడం మొదలు పెట్టాను.

కాబోలు—నా అనుభవం దీనికి పరమ వ్యతిరేకం—నే ననుకున్న దేదీ అనుకున్నట్టు జరక్కపోవడం నా నిత్యకృత్యం—ఎప్పుడూ నేను కోరిన కోరిక ఎదురుచూచిన తోవ వెంటనడచి రాలేదు. మానవ జీవిత మన్నా ఆశాభంగ మన్నా—నా నిఘంటువులో ఒకటే అర్థం—

ఆదరించవలసినమిత్రులు అవమానించారు. అనతిదూరంలో ఫలిస్తా యనుకొన్న ఆశలు ధ్వంస మైపోయాయి. హృదయ

మంతా నివాళిగా పట్టి ప్రేమించిన ప్రియురాలు నునుగాలి కెరటాల్లో తేలి జారిపోయే—సువాసనలా—సంగీతంలా— చేయి జాపినకొద్దీ దూరమై—చిరునవ్వుతో కరిగిపోయింది.

ఈ అప్రాప్తకాంక్షలలో—అశాంతితో—కుమిలి జాలిగా— భస్మం కావలిసిందేనా?

కాదేమో—దగ్ధహృదయాలకు ఆవంత ఊరటను—ఈష న్మాధుర్యాన్ని—దయతో అందించే రసపదవస్థ యేదన్నా వుంటుందేమో—ఆత్మశక్తికి అసాధ్యం లేదంటారే—

తర్వాత మూడేండ్లనాటి మాట—

2

దూరపుబంధువులు ఒకరు ఒకరాత్రి 'డిన్నర్ పార్టీ' కి పిలిచారు, సరిగా ఎనిమిది గంటలకు.

అదే సమయానికి ఒక పెద్దమనిషివచ్చి, 'వరల్డుపాలిటిక్సూ' చతుష్షష్టి కళలూ సావకాశంగా నాతో చర్చించడానికి 'ప్రాణా నాయమ్య' అని కూచున్నాడు.

భోజనం మొహం ఎరగనట్టు విందుకోసం ఇంటికివచ్చిన పెద్ద మనిషిని పంపివేయడమా? ఘరానామనుషులతో కాలంవిలువ తెలీని అనాగరికుడులా ప్రవర్తించడమా?

'సమస్య' తెగలేదు.

ఆయనపుణ్యమా అని పాపం ఆజనమేజయ మహారాజు— ఆట్టేసేపు నన్ను చంపకుండా తనంతతానే వెళ్లిపోయాడు.

సాధ్యమైనంత త్వరలోనే నాప్రసాధనం పూర్తిచేసుకుని గంతవ్యం చేరుకున్నాను.

లోనికి ప్రవేశించగానే, ఆదివ్యభవనప్పుగోడ గడియారం 8½ ను సూచిస్తోంది. హంత!

లోపలి వరండాలో నించుని, కిటికీలోంచి హాలులోకి చూశాను. ఓహో! కూరలు—పులుసులు ఉండలు—నలిగి—బద్దలై పొట్టల్లోకి పోతున్నాయి.

ఆ రసవత్కాండాలలోకి చొరబడనా—లేక ఇంటికి తిరిగిపోనా? ఇది కూడా ఒక సమస్యే! అక్కడే నిలుచుని ఆలోచిస్తున్నాను. కిటికీలనుంచి దూసుకువచ్చే 'పెట్రోమాక్స్' కాంతుల్లో నా తెలిపట్టుపంచా—జరీ సిల్కుకండువా—నన్ను చూసి నవ్వుతున్నాయి. మౌనంగా ఎదుటి శూన్యాన్ని చూస్తున్నాను—

3

పక్కతలుపొకటి చప్పుడయింది.

చటుక్కున ఎవరేనా వచ్చి—నన్ను ఇబ్బందిపెట్టి—లోపలికి తీసుకువెడితే—మీరా—ఎంత సేపయింది వచ్చి—ఆలస్యం చేశారే—అని విషపు నవ్వు నవ్వితే—పోదామనుకున్నాను. కాని, అవతలివారికి ఎంత అవసరమో... పైని గొళ్లెం వేసివుంది. చుట్టుపక్కల ఎవరూ లేరు—వెళ్లి గొళ్లెం తీసి, పక్కకి తప్పుకున్నాను. తలుపులు మెల్లగా విడ్డాయి.

ఏమిటిది! ఆశ్చర్యంతో నాతల గిర్రున తిరిగింది. 'కలయో వైష్ణవ మాయయో' అన్న పద్యం నాగొంతులో హోరు పెట్టింది.

రైలులో ఒక అప్సరస ఎంతోసేపు నీపక్కను కూర్చుని ప్రయాణం చేసిందనుకో—ఆమె నీ ఊపిరిబంధించి—కళ్లల్లో వెలుగులు చిమ్మ—నవ్వునవ్వుతూ—నీప్రాణసారాన్ని తోడడం ప్రారంభించు—ఆమె ఆకస్మికంగా ఒక 'స్టేషన్'లో నీవైపు చూడకుండానే దిగిపోయింది. అప్పుడు నువ్వు [illegible] తీసివేసిన బుట్టలా అయిపోయి, విలువైన వస్తువును అజాగ్రత్తవల్ల జారవిడుచుకున్న వాడిలా ఏడ్వావుగదూ— కొన్నాళ్లకు తలవని తలంపుగా ఆ దేవకన్య నీమార్గంలో ఎదురుపడి చిరునవ్వునవ్వితే—తన అతిలోక లావణ్యాన్ని నెమలి పురిలా నీయెదుట ఇంకొక్కసారి విప్పితే—ఏమౌతావు? సరిగ్గా అదే ఇప్పటి సంఘటన—

ఒక్కచూపులో — నాజీవనశాంతిని కలవరపరచినావి ఈ కుంకుమపూవు పెదవులే—పరిమళ ధూమరేఖలా వేలాడే అదే కత్తిలాంటి జడ—మాఘమాసపు మల్లెపూవులోంచి జారిన పచ్చి వెన్నెల బిందువంటి ఈ చిరునవ్వే—నా నిరంతర తపస్సునకు తీరనికోరిక—నాకళ్లలోని స్వర్గమే నాయెదుట తలవంచుకొని నడుస్తోంది. తలయెత్తి చూశాను.

"శర్వాణి!" ఇక్కడికెట్లా వచ్చింది?

నేను ఆలస్యంగా రావడానికీ ఈలావణ్యనిధి హఠాత్తుగా ఒకతలుపులోంచి వూడిపడడానికి ఏమిటి సంబంధం? దైవమన్నా—యోగమన్నా—అదృష్టమన్నా ఇదేనా? కొమ్ములు తిరిగిన దార్శనికులు దీనికోసమే తన్నుకుని ఛస్తున్నారు—

కాటుకకళ్లతో ఒకసారి బరువుగా నావైపు చూచి, రెండు మూడడుగులు వేసింది. నేలం అంచుల కొత్తసిల్కుచీర స్వచ్ఛత్వం—మెడలో ఘుమఘుమలాడే మంచిగంధపు చారికలు—శ్రద్ధగా పెట్టించుకున్న పెద్దకుంకుమబొట్టు సౌందర్యరేఖ—ఆమె నవయౌవనశోభకు కళావ్యాఖ్యానాలు.

4

"వాణీ!" ఆగింది.

"ఇంతలో—ఇంత అప్రయత్నంగా నిన్ను చూస్తా ననుకోలేదు." వుత్సాహంతో కంఠం తొట్రుపడింది.

కళ్లతో నివారించింది. అక్కడ మాటలాడడం ఇష్టంలేదని వూహించాను. ఆమె రసజ్ఞ దేవత—ఔచిత్యమూర్తి—ఎక్కడ ఎంత మాటలాడాలో తెలుసు.

సాభిప్రాయంగా ముందుకు నడిచింది. అనుసరించాను. ఇంటిమెట్లుదిగి, చరచరా రోడ్డుమీాదికి వచ్చాం. దీపస్తంభాల మసక వెలుతురు కొద్దిగా రోడ్డుమీాద పడుతోంది.

ఒకటి—రెండు కుక్కలూ—ఒకరిద్దరు మనుషులూ మాత్రమే తోవలో ఎదురుపడి, మమ్మల్ని బెదురుగా చూచి వెళ్లారు.

చట్టున ఆగి అన్నాను—

"పెండ్లి అయిన వెంటనే...అత్తవారింటికి వెళ్లిపోయావనుకున్నాను"

ఆమాటకు పండిన మొగలిపొత్తిలోని మిత్తని లోపలి రేకులా ఆమెముఖం నునుసిగ్గుతో పరిమళించింది.

మరోప్రశ్న "మగ అధికారం చలాయించకుండా, స్నేహంగా నీ సౌకుమార్యానికి తగినట్టు మృదువుగా ప్రవర్తిస్తున్నాడా?"

నా ప్రశ్నలోని గిలిగింతను ఆమె గ్రహించి వుండాలి.

"ఓ—యస్, చాలా ఖులాసాగా వుంటాడు స్నేహితుడు లాగ—మంచివాడు."

ఈజవాబు రాకూడదని నా ఆశ—వస్తుందనుకుంటే, ప్రశ్నించకేపోయేవాడిని.

లోకంలో వేసేకుశల ప్రశ్నలన్నీ ఇట్లాంటివే గావోలు—'అంతా బాగున్నారా? పిల్లలా? జీతం వృద్ధయిందా?' అన్నప్రశ్నలకు అవతలివాడు కోరేజవాబు 'ఏంబాగు—మొన్నటిది అదలా అయిందా? రాబడికన్న ఖర్చు ఎక్కువయి గిలగిలలాడిపోతున్నానుగదా—నువ్వు అదృష్టవంతుడివి.'

అంటే వృచ్ఛకుడి సంతోషం పొంగుతూ ముఖంలో కనబడుతుంది.

ఆమె, 'తన భర్త నిర్భాగ్యుడనీ—విరసుడనీ తన కతని మీద ఇష్టం లేదనీ నీనంటివాడు ఏపుణ్యశాలినికో దొరుకుతాడనీ' అంటూ ఇంకా ఆ మొహల్లా జాలిపడి—అతన్ని తిట్టడంలో తోడ్పడి—నా సహృదయత్వాన్ని ఎక్కాలల్లే గుణించి—ప్రేమను పెంచి పోట్లాడివుందును. ఇదీలోకయాత్ర. ఈ 'జెలసీ'ని ఏవునిసుత్వతనమూ—కళాపరిజ్ఞానమూ—సహృదయత్వమూ జయించలేవు గాబోలు—

"చాలా సంతోషం (అబద్ధం).

ఇన్నాళ్లికీ నీకు కోరుకొన్న భర్త దొరికాడు. అతని సహవాసంలో—ప్రేమలో నువ్వు సుఖపడుతూంటే అదే పదివేలు" ముఖం వెలవెలను వెకిలినవ్వులో కప్పడానికి ప్రయత్నించాను.

పెలవి వార నవ్వింది—

చనువైన పడుచుపిల్లను నుగని ప్రసంగంలో తియ్యగా నవ్వించగలిగినప్పటి ఆనందంమాత్రం అనుభవించాను.

"సిగ్గొచ్చి నవ్వింది చిలకశర్వాణి" ఆశు కవిత్వం వెలిగించాను.

పౌర్ణమీ చంద్రకిరణపు గిలిగింతలో కులికే పాలసముద్రపు లేత కెరటంలా కదలి, ఆమె నా భుజానికి తగిలేటంత దగ్గరగా వచ్చి, నా కళ్లల్లోంచి గుండెల్లోనికి చూస్తూ

"ఎంతదూరంలో వున్నా—ఎప్పటికీ—మీ మాటల్లోని హాయిని—చమత్కారాన్ని మరచిపోలేను."

ఆశకు, నాకు మళ్లా పునర్జన్మ వొచ్చింది.

ఈ ఒక్కమాటకోసమే—ఎన్ని అవమానాలనో—ఎన్ని దుఃఖాలనో—నిరాశలనో తొలగించుకొని బతికాను.

మనస్ఫూర్తిగా ప్రేమించిన పిల్లనుంచి వచ్చే మెప్పులో—నిరు నవ్వులో—మాధుర్యాన్ని అనుభవించడంలో వుండే కైవ ల్యాన్ని — ఈ రూపాయికొకైపైసలఘటాలకూ — ఒంటెద్దు బండి యాత్రీకులకూ—ఎవరు విప్పిచెప్పగలరు ?

ఆ ఇంటి ముందర రాధామనోహరం తీగల చాటున— మంచి సంగీతపు చివరికళలా...ఆమె చీర కొంగైనా కనపడు తుందేమో అని—దూరానికి విసరే జాజి సువాసనలా— ఆమె గొంతులోని మాటైనా వినపడు తుందేమో అని— చేసిన సుభాజ్వాలా భయంకర పరీక్షణలోని రుచిని ఏ మానవుడికి బోధపర్చగలను ! మళ్లా ప్రకృతిలో పడ్డాను.

"వాణీ ! భయంలేదు—మరచిపోగలవు. అతని కాగ లింతల్లో—సంసారంలో—పాత్రసామగ్రిలో పడి—తప్పకుండా..." చట్టున నోరు మూసిండి.

"అబ్బ — వుండండి. ఈ వేదనతో — ఈర్ష్యతో— మీ మృదుత్వాన్ని—సౌజన్యాన్ని చంపకండి—పోనీ ఎక్కడికీ వెళ్లను. మీతోటే వుంటాను. ఇప్పుడు—వెంటనే—ఎక్కడికి వెడదామో చెప్పండి. చప్పున మీకూ నాకూ రెక్కలు

పెట్టండి— మీ ఉద్యోగం— మెంబరుషిప్పులు— పుస్తకాల గుట్టలూ...తీరని సాన్నిహితం— అంతా ఒక్క ఊపులో ఎగరగొట్టి, నా వెంట రండి—మీ భావసౌధాల తలుపులు తీయండి— అక్కడగూడా కొన్నాళ్ళకు ఇద్దరం ఒకరికి ఒకరు పాతై— విసుగై— దేశవాళీ భార్యాభర్తల్లా— ఈసడించుకుంటూ బతుకుతా నేమో—దరిద్ర వివాహ యంత్రం ఇట్లాగే తిరుక్కుంటూ వస్తోంది.

సహారంగా వుండి—ఒకరినొకరు ఆకర్షించుకుంటూ—ఎడబాటులోని తియ్యని బాధను—అందని ఆశలకోసం పడే—వేదనా సుఖాన్ని—అనుభవిస్తూ విధి చూపిన తోవల్లో—సురక్షితంగా ప్రయాణం చేద్దాం—

అప్రయత్నంగా దొరికిన ఈ ఉత్తమ నిమిషాలను శుష్కతర్కంలో వృధా చేసి ఏం ప్రయోజనం ?" పెదవులు అదురుతున్నాయి. సిగ్గు నిండిన కళ్ళతో నవ్వింది.

ఔ నేమో—రంగు రంగుల ఇంద్ర ధనుస్సౌందర్యం—తన చేతికి దొరకలేదని ఏడిస్తే—ఆకాశపునీలం—వసంత లావణ్యం—తన ఒడిలో పడలేదని తపిస్తే—ఏం లాభం !

ఋతువుల్లో—కాలాల్లో—సుకుమార సుందర లోకాల్లో—కాలూనకనే పరుగెత్తే ఉత్కృష్ట శోభను—ఒక్కడు దాచుకోవాలంటే సంభవమా ! మచ్చరం—ఈ అపూర్వ శుభయామినిలోని నిమిషాలకోసం ఎంత తపస్సు చేశావో—బ్రతుకంతటికీ ఏ రెండు రోజులో సుపర్వదినాలు—తక్కినవన్నీ పూక

బస్తాలు. చూసుకో—ఉత్తరక్షణంలో ఈ జీవన మాధుర్య మంతా కరిగిపోతుంది. తెల్లవారితే ఏముంది? చవట పుస్తకాలూ— శుష్క పాఠాలూ— నీరస నీతులూ... అంటోంది అంతరాత్మ "నేను తొందరగా వెళ్లాలి."

"ఎలక్ట్రిక్ షాక్ తగిలినా అంత బాధగా వుండదేమో— నిమిషం పోతే—శర్వాణి నుంచున్న చోట శూన్యం ఆక్రమిస్తుందని వూహించితే బాధగా వుంది.

ఆమె కదిలింది.

"ఉండవూ—ఇంకొక్క నిమిషం నీ శరీరపు లావణ్యాన్ని—ముడ్డ వంపులోని అందాన్ని—కళ్లల్లోని మోహసందేశాన్ని—తనివితీరా చూడనీ—నాకే వీణాకంఠం కదిపి రెండు మాటలు—పాడు—"

ఇంకా దగ్గరగా జరిగి గట్టిగా— తుదిగా ఆమెను గుండెలకు ఒత్తుకుందామని తలిచాను. గ్రహించిందేమో—దూరంగా జరిగి, సానుభూతిగా నవ్వుతూ "మిత్రమా, నేను అపార్థం చేసుకోను—నాలోనూ వుంది జ్వాల—కాని... ఈ శరీరం ఇంకొకరిది—హృదయం ఎప్పుడూ మీది—దీని కృతజ్ఞతకూ— సన్నిధికీ మీరు పాత్రులు" అంతే—తలతిప్పుకొని ప్రక్క రోడ్డుని గామగా—చీకటిలో కలిసిపోయింది.

టక్కున నా కాలి కేదో తగిలింది.

స్మృతి వచ్చి, కళ్లు తెరచి చూశాను. ఎదటి నా స్థవికతలో నిల్చినవి రెండు—కాలికి కొట్టుకున్న మంచపుకోడూ—గోడ మీద వేలాడుతూన్న అమృతాంజనం కేలండరూ.